# భారతీయ కథాభారతి

(అనువాద కథలు)

సేకరణ, సంకలనం, అనువాదం

**కాకాని చక్రపాణి**

ఎమెస్కో

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| **అస్సామీ** | | 017 |
| లక్ష్మీనాథ బెజ్‌బరువా | జయంతి కథ | 020 |
| రోమా దాస్ | బాల్య ప్రేమ | 029 |
| జోగేన్‌దాస్ | రక్షకుడు | 040 |
| నిరుపమా బోర్‌గొహైన్ | చిరునామా | 048 |
| **ఉర్దూ** | | 058 |
| ఇస్మత్ చుగ్‌తాయ్ | రజాయి | 061 |
| సలామ్ బిన్ రజాక్ | కామధేనువు | 074 |
| షఫీ మష్హదీ | మాటనమ్మకం | 085 |
| షఫీక్ అహ్మద్ | పరాజయం | 093 |
| **ఒడియా** | | 097 |
| ఫకీర్ మోహన్ సేనాపతి | రేబతి (రేవతి) | 100 |
| గోపీనాథ్ మహంతీ | తాడ్పా | 112 |
| సరోజినీ సాహు | అత్యాచారం | 128 |
| సత్యవ్రత్‌రథ్ | ఎవరిదా గొంతు? | 136 |
| **కన్నడం** | | 141 |
| మాస్తి వెంకటేశ అయ్యంగార్ | పెరుగు అమ్మి | 144 |
| త్రివేణి | అతడి ఎంపిక | 156 |
| లంకేశ్. పి | స్టెల్లా అన్న పేరున్న అమ్మాయి | 163 |
| రాజశేఖర నీరమాన్వి | అండ | 175 |

| | | |
|---|---|---|
| **కశ్మీరీ** | | 188 |
| అమీన్ కామిల్ | పేదవాడి పెళ్ళాం | 190 |
| అవతార్ కృష్ణ రహబార్ | నీడ | 195 |
| హరికృష్ణ కౌల్ | దుఃఖార్తులు | 201 |
| నిసార్ నసీం | మృగతృష్ణ | 211 |
| **కొంకిణి** | | 215 |
| చంద్రకాంత్ కేణి | అమాయకత్వం | 217 |
| మీనాకాకోడ్కర్ | ఒరే నా చురుంగన్... | 223 |
| **గుజరాతీ** | | 232 |
| హిమాంశు వోరా | కుటుంబ సభ్యుడు | 235 |
| దిలీప్ రాణ్‌పురా | కన్నీళ్ళ వర్షం | 239 |
| భూపేన్ ఖఖర్ | గ్లాసు | 246 |
| నాయికల్ గంగేరా | వెలుగునీడలు | 265 |
| **డోగ్రీ** | | 272 |
| వేద్ రాహీ | అనుపస్థితి | 274 |
| సుదేశ్ రాజ్ | రాలే ఇసుక రేణువులు | 286 |
| **తమిళం** | | 293 |
| న. పిచమూర్తి | కావలి | 296 |
| పుదుమైపిత్తన్ | మహాశ్మశానం | 308 |
| సుందరరామస్వామి | పునర్వైభోగం | 315 |
| ప్రపంజన్ | దయాళువు | 326 |
| **నేపాలీ** | | 338 |
| బిశ్వేశ్వర్ ప్రసాద్ కొయిరాలా | దిగువ భూములు | 341 |
| యం.యం. గురుంగ్ | వాంఛలు (ఆపైన ఓ మృతశరీరం) | 347 |
| సమీరణ్ ప్రియదర్శి | అంతరంగం | 351 |
| మోహన్ ఠాకూరి | తాజాకలం | 364 |

| | | |
|---|---|---|
| **పంజాబీ** | | 367 |
| బూటాసింగ్ | ముసలమ్మ | 370 |
| అమృతాప్రీతం | కిరొసిన్ కంపు | 376 |
| అజిత్ కౌర్ | అలీబాబా మరణం | 383 |
| దలీప్‌కౌర్ తివానా | అమాయకురాలు | 399 |
| **బెంగాలీ** | | 405 |
| పరశురాం | సరళాక్ష హోం | 408 |
| ఆశాపూర్ణాదేవి | అగ్గిపెట్టె | 424 |
| సమరేశ్‌బాబు | సుడిగుండం | 430 |
| జానకీ మిత్ర | ఏకాకి | 443 |
| **భారతీయ ఆంగ్లం** | | 450 |
| ముల్కరాజ్ ఆనంద్ | తప్పిపోయిన పిల్లవాడు | 453 |
| ఆర్.కె. నారాయణ్ | తండ్రి సాయం | 461 |
| జై. నింబ్‌కర్ | వీరుడి మరణం | 469 |
| జస్వంత్ సింగ్ | పంచాయితీ | 478 |
| **మణిపురి** | | 483 |
| ఎం.కె. బినోదినీదేవి | స్వరం | 486 |
| ఎ. శ్యామకృష్ణ శర్మ | మంత్రగత్తె | 495 |
| **మరాఠీ** | | 500 |
| జి.ఏ. కులకర్ణి | తపస్వి | 503 |
| గంగాధర్ గాడ్గిల్ | కాందిశీక నగరం | 509 |
| గౌరీదేశ్‌పాండే | తడిసిపోయిన బెస్త | 522 |
| గణేశ్ అవటే | అతిథి | 528 |
| **మలయాళం** | | 537 |
| కరూర్ నీలకంఠ పిళ్ళయ్ | చెక్కబొమ్మ | 540 |
| కోవిలన్ | శంఖం | 551 |
| వి.వి. యన్ (నాయర్) | ప్రేమపెళ్ళి | 563 |
| కమలాదాస్ | పాయసం | 575 |

| | | |
|---|---|---|
| **మైథిలీ** | | 579 |
| లిలీ రే | అనుకోని అతిథి | 581 |
| ఉపేంద్ర దోషీ | మొదటి అడుగు | 590 |
| **రాజస్థానీ** | | 597 |
| లక్ష్మీకుమారి చుందావత్ | రాజపుటానీ | 600 |
| విజయదాన్ దేథా | సందిగ్ధావస్థ | 608 |
| మీతేష్ నిర్మోహీ | న్యాయం లభిస్తుంది! | 634 |
| చైనాసింహ్ రాజపురోహిత్ | చెప్పుల్లేని కాళ్ళు | 643 |
| **సంస్కృతం** | | 656 |
| రాధావల్లభ్ త్రిపాఠీ | వైవా | 659 |
| **సింధీ** | | 673 |
| మోతీలాల్ జోత్వానీ | వ్యర్థ ప్రయాస | 675 |
| బ్రిజ్‌మోహన్ | తోక | 682 |
| **హిందీ** | | 686 |
| గురుదత్ | గురుదక్షిణ | 693 |
| సుదర్శన్ | ఓటమిలో గెలుపు | 706 |
| యశపాల్ | పరదా | 712 |
| జైనేంద్రకుమార్ | బహుమతి | 719 |
| ఉషా ప్రియంవద | రిటైరయ్యాక | 727 |
| హృదయేశ్ | రామచిలకలు | 739 |
| స్నేహ మోహనీశ్ | ఈవెనింగ్ ఇన్ బాంకాక్ | 751 |

# అస్సామీ

ప్రాచీన కాలంలో బ్రహ్మపుత్రానది లోయలో, కరుటోవా నదికి తూర్పున ఉన్న ఈ ప్రాంతాన్ని కామరూపమనీ, ప్రాగ్జ్యోతిషమనీ పిల్చారు. మధ్యయుగంలో ఆహోం, రాజులు 600 యేండ్లపాటు (క్రీ.శ. 1228-1826) పరిపాలించారు. అస్సాం 1824-'26లో జరిగిన మొదటి బ్రిటీషు- బర్మీసు యుద్ధం తర్వాత బ్రిటీషు ఇండియాలో భాగమయింది. 1912లో అస్సాం ప్రావిన్స్ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో ఒక రాష్ట్రమయిన అస్సాంకు రాజధాని దిస్‌పూర్; గౌహతి పెద్ద నగరం. రాష్ట్ర విస్తీర్ణం 31,000 చదరపు మైళ్ళు. జనాభా మూడుకోట్లపైన వుంటుంది. అస్సామీ అధికార భాష; బారక్ లోయలోని మూడు జిల్లాల్లో బెంగాలీ, బోడోలాండ్ ప్రాంతపు నాలుగు జిల్లాల్లో బోడో భాష మాట్లాడతారు.

తొమ్మిది, పది శతాబ్దాలకు చెందిన చర్యాపదలో అస్సామీ భాషాలక్షణాలు ఉన్నాయంటారు. పధ్నాల్గవ శతాబ్దంనుండి అస్సామీ సాహిత్యం వికసించ నారంభించింది. అప్పుడు హరివర విప్రుడు రాసిన మహాభారతం ఆధారంగా వవ్రువహనార్ యుద్ధ, రామాయణ కథ ఆధారంగా లవకుక్సార్ యుద్ధ వెలువడ్డాయి. ఈకాలానికి చెందిన ప్రముఖ కావ్యం మాధవ కందాలి రాసిన సప్తకాండ రామాయణ. ఇందులో ఉపయోగించిన (వ్యావహారిక భాషకు భిన్నమైన) సాహితీభాష 19వ శతాబ్దంలో కొత్త సాహిత్య ప్రాదుర్భావం వరకు ప్రామాణిక భాషగా నిల్చింది. ఆహోం రాజుల కాలంలో 17వ శతాబ్దంనుండి వచన చారిత్రక రచనలకు ప్రాధాన్య లభించింది. బ్రిటీషువారి కాలంలో, తూర్పు అస్సాంలో ముద్రణ, సాహితీ కార్యకలాపం అధికంగా ఉండటంతో అక్కడి భాష ప్రామాణికమైంది. ఇటీవలి కాలంలో గౌహతి రాజకీయ, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందటంతో, ప్రామాణిక అస్సామీ భాష తూర్పునుండి ఇక్కడకు కదలి వచ్చింది. భారతదేశంలోని మిగతా ప్రాంతాలలో లాగానే, భాషాభివృద్ధిలో మిషనరీల పాత్ర చెప్పుకోదగ్గది. ఆధునిక అస్సామీ సాహిత్య ప్రారంభం జానకీ (1889) పత్రికతో మొదలవుతుంది; అందులోనే లక్ష్మీకాంత బెజ్‌బరువా

(1868–1936) మొదటగా లఘుకథను ప్రచురింప చేశాడు; అరుణోదయ్ (1846–'80) పత్రిక కూడ ఎన్నో అనువాదాలను ప్రచురించింది. 1891లో పద్మాబతి దేబి ఫుకనాని రాసిన మొదటి అస్సామీ నవల సుధామర్ ఉపాఖ్యాన్ ప్రకటిత మయింది. రజనీకాంత బొర్దొలాయ్ తన ప్రసిద్ధ నవల మిరి జియోరి ప్రచురించాడు. హేమ్ బారువా (1835–'96) లాంటి రచయితలు చేసిన కల్పనా రచనలు, భిన్న రచయితలు బెంగాలీనుండి అస్సామీలోకి చేసిన అనువాదాలూ లక్ష్మీకాంత బెజ్‌బరువా రచనలకు పాఠకులను ఆయత్తం చేశాయి. అతడి కథలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. శరత్‌చంద్ర గోస్వామి (1887–1944) కథలు మానవసంక్లిష్ట సంబంధాలను వెలికి తీస్తాయి. దండీనాథ్ కలితా (1890–1955) అతడి సమకాలికుడు. నకుల్‌చంద్ర భూయాన్ (1895– 1968), హలీరామ్ దెకా (1901–'1862) సామాజిక వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చారు. లఖీధర్ శర్మ (1896–1935) కథలు ఒక లోలుపతను ప్రసాదిస్తాయి.

బిరించీకుమార్ బారువా (1908–1964) ఆగమనంతో అస్సామీ కథకో విపులత వచ్చింది. అతడి కథాసంకలనాలు *పోత్ పరిబర్తన్*, *అఘుని బాయ్* మిగతా సమకాలిక రచనలకు భిన్నంగా ఉంటాయి. రోమాదాస్ (1909– '81) కథలు నాగరికతను, మర్యాదను వ్యక్తపరుస్తాయి.స్వాతంత్ర్యం తరువాత ఈ ప్రక్రియ విస్తార విషయాలను చేపట్టింది. సయ్యద్ అబ్దుల్ మాలిక్ (1919–2000) కథలు భౌతిక, ఆధ్యాత్మిక భ్రష్టతను వెలికి తీసేట్టు ఉంటాయి. శీలభద్ర (1923–), బీరేంద్రకుమార్ భట్టాచార్య (1924–'97) కూడ చెప్పుకోవల్సిన రచయితలు. ఈ ప్రక్రియను ఉన్నత శిఖరాలకు చేర్చినవాడు మహీమ్ బోరా (1926–). ఆధునిక అస్సామీ కథకు మార్గదర్శకత్వం వహించినవాడతడు అని భావిస్తారు. "కథానిబరీ" లాంటి కథలలో అతడు నిశ్శబ్దపు వివిధకోణాలను శోధించాడు. అందులో అతడు ఒకపార్శ్వంలో అస్తిత్వవాదపు మృత్యు ప్రశ్నలను, మరొకపార్శ్వంలో బాధ్యతను ప్రదర్శించాడు. అలాగే, జోగేన్ దాస్ (1928–'99) సమకాలీన సమాజ, సాంస్కృతిక నిర్మాణాల అసంబద్ధతలను ప్రదర్శిస్తాడు. అస్సామీలో మహా ఆవిష్కృతాత్మక రచయిత సౌరవ్‌కుమార్ చాలిహా (1930–); తన సమకాలికులకు భిన్నంగా అతడు ఆధునికత్వపు అనుభవాన్ని తన రచనలలో ప్రతిబింబించాడు. అతడు రచయితలకు, పాఠకులకు కూడ కొత్త దృశ్యాలను ప్రదర్శించాడు. హెుమేన్ బోర్‌గొహైన్ (1932–) పేరొందిన నవలా కారుడు. అతడి

“ఇస్మాయిల్ షేకోర్ సంధనోత్”, “నరకట్ బసంత” వంటి కథలు అతడి సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాయి. భబేంద్రనాథ్ సైకియా (1932– 2003) ప్రాకృతిక వాదాన్ని ప్రస్ఫుటింప చేస్తూ, వివరణకు ప్రాధాన్యమిచ్చాడు. నిరుపమా బోర్‌గొహైన్ (1932–). అతులానంద గోస్వామి (1935–), నగేన్ సైకియా (1938–), ప్రణయ్‌జ్యోతి దెకా (1939–), మిమోనీ రైజోమ్ గోస్వామి (1941–), జహీరుల్ హుస్సేన్ (1941–2002), అపూర్బ శర్మ (1943–), సౌరభ్‌కుమార్ చాలిహా, హరేకృష్ణ దెకా (1943–), దేబబ్రతదాస్ (1950–), మనోరమాదాస్ మెధి (1950–), భూపేంద్ర నారాయణ్ భట్టాచార్య (1951–), జ్యోతిప్రసాద్ అగర్‌వాలియా, బిష్ణు ప్రసాద్ రభా, అతుల్‌చంద్ర హజారికా, నళినీబాలాదేవి, నవకాంత్ బారువా తదితర రచయితలు సుసంపన్నం చేశారు.

1980ల తర్వాత అస్సామీ కథ కొత్త కథన పద్ధతులతో, లైంగికత్వం, స్వత్వం, జాతీయతలాంటి పరిచిత వస్తువులను భిన్న రూపాలలో ప్రదర్శించింది. ఈ కాలంలో ఎంతోమంది రచయిత్రులు కథారచనకు పూనుకున్నారు. తన కథాసంకలనాలు *కథాగరత్ ఈశ్వర్, ప్రేమ్ గాథా* లలో భిన్న విషయాలను గురించి మనోరమా దాస్ మేధీ (1950–) ప్రస్తావించింది. భుపనేంద్ర నారాయణ్ భట్టాచార్య (1951–),ఆరూప పతంగియా కలితా (1956–), జయంతకుమార్ చక్రొబర్తీ (1957–), జ్యోతిష్ సిక్‌దర్ (1959–), రాబిన్ శర్మ (1960–), బొంతి సంచోవా (1962–), అపూర్బకుమార్ సైకియా (1962–), మనోజ్‌కుమార్ గోస్వామి (1962–), తపన్ దాస్ (1962–), బితోబన్ బోర్‌బొరా (1963–), మైనీ మహంతా (1963–), అనూరాధాశర్మ పూజారి (1964–), ఇమ్రాన్ హుస్సేన్ (1964–), మణికుంతల భట్టాచార్య (1968–), అతను భట్టాచార్య (1968–), అనామికా బోరా (1968–), ప్రశాంతకుమార్ దాస్ (1971–), రత్న భరలీ తాలుక్‌దార్ (1971–), ధ్రుబజ్యోతిశర్మ (1973–), మౌసూమీ కదల్ (1974–), ఆరూప్‌కుమార్‌నాథ్ (1974–), మోనాలిసా సైకియా (1975–), గాతాలీ బోరా (1977–), మోనికాదేబి (1979–) తదితర రచయితలూ అస్సామీ కథను ప్రపంచ కథలతో పోటీ పడేట్టు చేస్తున్నారు. అస్సామీ కథాప్రగతిలో *బన్హి, అబహోన్, రామ్‌ధేను, ప్రకాశ్, గరియోషి,* పత్సోరి లాంటి పత్రికల సేవ మరువలేనిది.



**లక్ష్మీనాథ బెజ్‌బరువా (1864–1938):** ఇతడిని అస్సామీ సాహిత్య పథప్రదర్శకుడుగా భావిస్తారు, 'సాహిత్య రథి' అని పిలుస్తారు. నాగావ్ సమీపంలోని ఆహత్‌గురిలో, 1864 నవంబరు(?)లో జన్మించాడని భావిస్తారు. డిబ్రూఘుర్‌లో 1938 మార్చి 26న మరణించాడు. తన ఆత్మకథ *మోర్ జీబన్ సోవరన్* లో చెప్పుకున్నట్లు అతడి పుట్టిన రోజు విషయంలో సందిగ్ధం ఉన్నది. అస్సాం సాహిత్య సభ అతడి పుట్టిన రోజును 1864 అక్టోబరు 14గా నిర్ధారించింది. అతడు తన బాల్యాన్ని తండ్రి ఉద్యోగ రీత్యా ఆయనతో పాటు వెళ్తూ, అస్సాంలోని భిన్న ప్రదేశాలలో గడిపాడు. శిబ్‌సాగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం. సిటీ కాలేజీలో ఎఫ్ఏ, ఆ తర్వాత బియే, ఎంయే, బియల్ డిగ్రీలు కలకత్తాలో చేశాడు. రబీంద్రనాథ్ మేనకోడలు ప్రగ్యాసుందరీదేవిని వివాహం చేసుకున్నాడు.

అతడు 8 నాటకాలు, 4 ప్రహసనాలు, 3 చారిత్రక రచనలు, ఒక ఏకాంకిక, 3 జీవిత చరిత్రలు, 2 ఆత్మ కథలు రాశాడు. పిల్లల కథలు, కథాసంకలనాలుకూడ ప్రచురించాడు. 'ఓ ముర్ అపునార్ దేశ్' అని అతడు రాసిన గీతం అస్సాం రాష్ట్రగీతమయింది.తన హాస్య రచనలకు గాను 1931లో అస్సాం సాహిత్య సభ అతడికి 'రసరాజ్' అన్న బిరుదాన్నిచ్చింది. అతడి కవితా సంకలనాలు: కొదమ్ కోలి (1913), *పొదుమ్ కోలి* (1968); నవల *పొదుమ్ కుంవరి*; కథాసంకలనాలు: *సురభి* (1909), *జాధుకథార్ కుకి* (1912), *జోన్‌బిరి* (1913), *కెహోకలి,కోకదేయాత నతిలోరా, బుర్హి ఎయిర్ సాధు, జునుకా.*

# జయంతి కథ

(ఆంగ్లానువాదం: జుగల్ కలిత. లక్ష్మీనాథ బెజ్‌బరువా జోనకీ యుగానికి చెందినవాడు; అంటే అస్సామీ సాహిత్యంలో అది కాల్పనిక యుగం. విషాదంలో గొప్పదనం ఉందని భావించే లక్షణం కాల్పనికతలో ఒక భాగం. అందుకే ఆ కాలంలో, లైలా–మజ్నూ, పార్వతీ– దేవదాసు లాంటి కథలను రచయితలు, పాఠకులు ఆదరించారు. ఈ కథ చివరలో భర్తను రక్షించిన జయంతి మరణించాల్సిన అవసరం లేదు. కానీ, ఆనాటి కాల్పనికత ఆమె మరణాన్ని ఆశించింది. రచయిత దాన్ని ఆదరించాడు.)

**జ**యంతి కులీన కుటుంబంలో జన్మించింది; ఆమె వివాహంకూడ కులీన కుటుంబంలోనే జరిగింది. ఆమె దేనికీ లోటులేని ప్రపంచంలో, అఖండ సంతోషంలో